


# తెర వెనక

భమిడి శకుంతల

ఆఫీసరు వేద్రాది కాలింగ్ బెల్ కొట్టగానే వచ్చి నిలబడ్డాడు, ఫ్యూన్ శంకరయ్య "సార్" అంటూ!

"పార్వతీశం గారిని పిలు" చెప్పాడు ఆయన.

రెండు నిముషాల తరువాత ఫ్యూను వచ్చి చెప్పాడు, యింకా రాలేదని. వేద్రాదికి ఆరోజు శనివారం అని ఎందుకో గుర్తుకు రాగానే "ఓహ్. మరిచిపోయాను. ఇవాళ పార్వతీశం గారి రాక, పదకొండు గంటలకే కదూ!" అనుకున్నాడు.

ఏభై అయిదేళ్ళ పార్వతీశం గారు, ఒక కేంద్ర ప్రభుత్వ ఆఫీసులో ఓ ముఖ్యమైన సెక్షనుకు సూపర్నెంటు. ముప్ఫై అయిదేళ్ళ సర్వీసులో ఆయనకు తెలిసింది — సిన్సియరుగా పనిచేయటం, నెలవగానే రెవిన్యూస్టాంపు కెదురుగా సూచించిన జీతం జేబులో వేసుకోడం, ముక్కుకు సూటిగా నడవటం — తప్పించి వేరేదేమీ పట్టించుకోని పాత కాలపు మనిషి.

పార్వతీశం రోజూ ఉదయం అయిదింటికే తన దిన చర్య మొదలుపెట్టి, ఎనిమిదిన్నరకే యింటి నుంచి ఆఫీసు పర్యానికి బయలుదేరి దారిలో వున్న దేవుళ్ళందరిని పలకరించుకొంటూ తొమ్మిదిన్నరకు ఆఫీసు చేరతాడు.

అటెండెన్సు రిజిష్టరులో సంతకం చేసి, పావు గంట సేపు రామకోటి రాస్తాడు. భగవద్గీతలో పది శ్లోకాలు పారాయణం చేసి ఆ రోజు చేయవలసిన పని తాలూకు ఫైళ్ళు, కాగితాలు ముందేసుకొని యంత్రం లాగ పనిచేసుకు పోతాడు.

టంచన్‌గా ఒంటి గంటకు పని నిలుపుచేసి, చెట్టుక్రింద లోకాభిరామాయణంలో చేరి రాజకీయాలు, సినిమా కబుర్లు, మొదలైన అంశాల మీద అనర్గళంగా వుపన్యాసం దంచుతాడు.

రెండయ్యేసరికి సెక్షను చేరి తిరిగి కాగితాలు, ఫైళ్ళతో కుస్తీ పడతాడు. అయిదింటికే తోటి గుమాస్తాలు, సూపర్నెంట్లు, వెళ్ళిపోయినా పార్వతీశం మాత్రం ఆ రోజు పనయితే మాత్రం సీట్లోంచి కదలడు.

మొత్తంమీద ఆరు గంటలకు ఆఫీసునుంచి బయటపడి యింటికి వెళ్ళే దారిలోని దేవుళ్ళందరిని పలకరిస్తూ, కూరలు కొనుక్కొని యిల్లు చేరేసరికి ఎనిమిది దాటుతుంది, రాత్రి.

భోజనం చేసి, తనతో తెచ్చిన ఆఫీసు ఫైళ్ళని తెరిచి వాటిమీద దృష్టి కేంద్రీకరించి... ఎప్పుడో నిద్రలోకి జారేసరికి, ఆయనకి ఓ ఆనందం, తృప్తి కలుగుతుంది.

అందుకే ఆఫీసర్ల దృష్టిలో "పార్వతీశం సిన్సియర్ అండ్ ఎఫిషియంట్ ఉద్యోగి;" అటువంటివాడు, ఆఫీసర్లకు ఓ వరం.

మహాత్ముడిలా తిట్టినా, ఏమన్నా పట్టించుకోడు. ఎదురు తిరగడు... తనకిది కావాలి అని ఆఫీసర్లని కోరడు... స్టాఫుపట్ల చాలా వుదాసీనంగా వుంటూ, వాళ్ళు పని చేయకపోయినా వాళ్ళ పని కూడా తనే చేస్తూ, వారిచేత "మా సూపర్నెంటు చాలా మంచివాడు" అనిపించుకొంటున్నాడు. అదే ఆయన కోరుకునే వరం.

* * *

"చూడండి పార్వతీశంగారూ! రామకోటి రాసుకోడం, భగవద్గీత శ్లోకాలు చదవటం, మీ పని, స్టాఫు పని చేసుకోడమేనా, మీ విధి? మీ స్టాఫు ఎప్పుడొస్తున్నారు, ఏం పని చేస్తున్నారు, ఎక్కడెక్కడ కాలక్షేపం చేస్తున్నారు? మొదలైన విషయాల గురించి కూడా మీరు శ్రద్ధ వహించాలి... వాళ్ళు అడిగినప్పుడల్లా సెలవు రికమెండ్ చేయటం బాగోలేదు... ఆ రాజ్యలక్ష్మి చూడండి, ఎంతసేపూ పుస్తకాలు, నవలలు చదవటం; లేదా మఫ్లర్లు ఏదో అల్లిక చేసుకోడం, అంతగా లేకపోతే కునికిపాట్లు పడటం... అంతకన్నా ఏమైనా గమనించారా మీరు?

"శోభనం పెళ్ళికూతుర్లా అలంకరించుకొని తనచుట్టూ జనాన్ని ఆకర్షించుకొంటూ, తన పని... వాళ్ళ పని కూడా ఎగవామం పెడులోంది... తను ఆఫీసుకు వస్తోందో, ఫాషన్ పెరేడ్‌కు వస్తోందో ఎప్పుడైనా తెలుసుకొన్నారా?..."

ఆఫీసరు రూములో, పార్వతీశం మామూలుగానే ఆ రోజు కూడా ఆ విధమైన మందలింపులు, హెచ్చరికలు స్వీకరించి బయటకు అడుగుపెట్టేడు. వారానికి ఒక్కసారైనా ఆఫీసరుచేత ఆవిధంగా అనిపించుకోకపోతే ఆయనకు పని చేసినట్లు తోచదు.

పదిహేనేళ్ళ సూపర్నెంటు అనుభవంలో ఆయన ఎంతోమంది ఆఫీసర్లని, వారి కేకలు — తిట్లు — మందలింపులు... పొందేడు. అయినా ఆయన బాధపడదు, విచారించదు.

* * *

పార్వతీశం భార్య సుభద్ర. ఆవిడ అదృష్టం బాగోలేక చదువుకోకపోయినా, లోకజ్ఞానం విషయంలో ఎంతో అనుభవం పత్రికలు, పుస్తకాల ద్వారా తెలుసుకొంది. తన భర్తకి యిల్లు, ఆఫీసు తప్పించి వేరే ఆలోచన లేకపోవటంపట్ల ఎంతో విచారంగా వుంటుంది. కాని ఆవిడ భర్త వైఖరి పట్ల అంతకన్నా ఏమీ చేయలేదు.

"ఇన్నేళ్ళనుంచి ఉద్యోగం చేస్తున్నారు...

ఏం సాధించేరు ? ఇల్లు, భార్య, పిల్లలు, చదువులు... ఎప్పుడైనా పట్టించుకొన్నారా ? ఎంత సేపూ ఆఫీసూ, పనేనా ? ఇంతచేసినా మెప్పూ, గౌరవం ఏమైనా వున్నాయా ? మీ సెక్షన్లో స్టాఫు పని చేయకపోతే వాళ్ళ పని మీరు చేయాలా ? వాళ్ళకి జీతాలు రావటంలేదూ ? ఆమాత్రం జ్ఞానం లేదా వాళ్ళకి ? బాధ్యత మరిచిపోయి, చెట్లక్రింద రోడ్డుమీద "జీతాలు పెంచాలం"టూ, ప్రభుత్వాన్ని నిరశిస్తూ సమ్మెలు చేయటం అలవాటయిపోయిన వారందరికి... యివేమీ తెలియవా ? ఎంత అమాయకు లండీ మీరు ?

ఇంతకీ మీరు తాళి కట్టింది నాకా, ఆఫీసుకా? బొత్తిగా లౌక్యం, రాజకీయం తెలీదు మీకు! మీ ఒక్కరు పని చేయకపోతే, యీ దేశానికి ఏం ప్రమాదం రాదు. ఎన్నో లక్షలమంది వుద్యోగులు జీతాల కోసమే ఆఫీసులకు వెడుతున్నారు...

ఆరోగ్యం కూడా లెక్కచేయకుండా యిలా పనిచేస్తే రేపు మీకేదయినా అయితే ఎవరు చూస్తా రండీ ? పోనీ... ఓ ముఖ్యమైన సెక్షన్లో పని చేస్తూ, ఆఫీసర్ల దృష్టిలో మంచి పేరు పొంది కూడా మీ తమ్ముడికి కనీసం ప్యూను వుద్యోగం సంపాదించుకోలేకపోయారు...

రోజులు మారుతున్నాయి... మనుషులు, అలవాట్లు, పద్ధతులు మారిపోతున్నాయి... కాని మీరు మాత్రం మారకపోవటం కేవలం మా దురదృష్టం... భవిష్యత్తుని ఆలోచించటం, మమ్మల్ని సుఖపెట్టడం నేర్చుకోండి యిప్పటికైనా!"

పార్వతీశానికి భార్య మాటలు కొత్తగాదు. వెలకోసారయినా వినకపోతే తనకేదో అనారోగ్యంగా వున్నట్లు అనిపిస్తుంది...

* * *

నిజమే ! పార్వతీశం సిసలైన ఉద్యోగి. రామకోటి వ్రాయటంవల్లనైతేనేం, భగవద్గీత పారాయణం చేయటంవల్లనైతేనేం ఆయనకి న్యాయం, నీతి, ధర్మం, నిజాయితీ తప్పించి మరేదీ తెలియదు. క్రిందస్థాయినుంచి, పైస్థాయివరకూ అలుముకున్న అవినీతి అంటే ఆయనకు ఎలర్జీ! తన సెక్షన్లో... తనతోపాటు పనిచేసే స్టాఫు అవినీతిపరులు అని తెలిసికూడ కళ్ళు మూసుకొంటాడు. వారిస్తే తనకే ప్రమాదం అని తెలుసు. అందుకే చూసీ చూడ నట్లుంటాడు.

తను లంచాలు పుచ్చుకోడు. కాని బయటి ప్రపంచంలో లంచం యివ్వందే పనులు జరగవు... ఏం చేస్తాడు. వాళ్ళు గడ్డి కరుస్తున్నారని తను గడ్డి కరవలేదు కదా ?

పార్వతీశం ఎస్టాబ్లిష్‌మెంట్ సెక్షను సూపర్నెంటు. అయిదేళ్ళనుంచి అదే సెక్షన్లో వుంటూ ఎంతోమందికి ఉద్యోగాలు...ప్రమోషన్లు... ట్రాన్స్‌ఫర్లు... యిప్పించాడు. వాటి వెనుక తను ఎంతయినా సంపాదించవచ్చు !

కాని అవినీతి అనే రాక్షసికి తాను బందీ కాలేదు. ఆరాధించలేదు... కనీసం కన్నెత్తయినా చూడలేదు. అది చేతకానితనమో, దురదృష్టమో, ఏదయినా కావచ్చు!

* * *

## తెర వెనుక

ఆఫీసులో యీ అయిదేళ్ళల్లో ఎన్నో మార్పులు జరిగాయి... ప్రతీ పనికి "యింత రేటు" అని నిర్ణయించుకొన్నారు, మిగిలిన వుద్యోగులు... ఆ మాటలు విన్నప్పుడు చెవులు మూసుకొంటాడు; చూసినప్పుడు కళ్ళు మూసు కొంటాడు పార్వతీశం.

తను ఎస్టాబ్లిష్‌మెంటు సెక్షనుకు రాకముందు జరిగిన ఓ సంఘటన ఎప్పుడూ మరిచిపోలేదు పార్వతీశం.

ఓ ముఖ్యమైన ఫైలుని, ఆయనంటే కిట్టని వారు ఎక్కడో దాచేసేరు... దానిమీద ఎంక్వయిరీ... ఫలితంగా ఇంక్రిమెంటు నిలుపుదల... తను నమ్మిన భగవద్గీత, రామకోటి ఏమీ చేయలేకపోయాయని విచారపడలేదు.

రోజులు బాగోలేనప్పుడు ఒక్కోసారి ఎన్నో అవాంతరాలు, సమస్యలని ఎదుర్కోవలసి వస్తుంది. అదే జరిగింది ఆయన విషయంలో !

పోయిన ఫైలు దొరికింది... తెచ్చియిచ్చిన వారిపైన మరో ఎంక్వయిరీ...పార్వతీశం నిర్దోషిత్వం బయటపడటం... ప్రభుత్వం వేసిన శిక్ష వుపసంహ రించుకోడం... జరిగిపోయాయి.

పోయిన ఫైలు గురించి "అయిదు వందలు పారేయండి, తప్పించుకోవచ్చు... ఇవన్నీ మామూలే!" తోటి ఉద్యోగులు సలహాలు యిచ్చారు.

ఆయనకు తెలుసు, తను తప్పు చేయలేదని. ఎప్పటికైనా అది బయటపడుతుందని...

ధర్మం జయించింది... న్యాయం బతికేవుంది... అని ఆయన అన్నప్పుడు అందరూ ఆ పిచ్చి వేదాంతాన్ని, హేళన చేసారు... అపహాస్యం చేసారు...

* * *

పాత ఆఫీసరు వేదాద్రికి బదిలీ అయింది.

కొత్తఆఫీసరు వేణుగోపాల్ చార్జి తీసుకొన్నాడు.

ఆయన రాకతో ఆఫీసులో వాతావరణం మారి పోయింది. ఎన్నో మార్పులు... ఆర్డర్లు... రిపోర్టులు... అమలులోకి వచ్చాయి.

ఆఫీసులో ఎన్నో సమస్యలు... అంతా రాజకీయమే !

కురుక్షేత్ర సంగ్రామంలో శ్రీకృష్ణుడు అర్జునుడికి "గీత" బోధించినట్లు, వేణుగోపాల్ పార్వతీశానికి కొన్ని మార్గదర్శక సూత్రాలు బోధించాడు. పర్యవసానంగా యీ విధమైన మార్పులు చోటు చేసుకొన్నాయి.

సెక్షన్లో రాజకీయాలు చర్చను నివారించటం... టైము ప్రకారం అటెండెన్సు రిజిష్టర్సు ఆఫీసరు రూముకి పంపించటం... స్టాఫు రాకపోకలు గమనిం చేందుకు రిజిష్టరు పెట్టి, అందులో అన్నీ సవిస్త రంగా వ్రాయించటం... సెలవు మంజూరు కాకుండా గైరుహాజరయ్యేవారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోటం...

చార్జిషీట్లు... మెమోలు... హెచ్చరికలు... జోరుగా యివ్వటం; స్టేట్‌మెంట్లు, రిటర్న్సు, క్లోజింగులు అన్నీ సకాలంలో జరిగేలా, పంపేలా చూడటం; కొన్ని ముఖ్యమైనవి.

మూడు నెలల్లోనే వేణుగోపాల్ ఉద్యోగు లందరికి సింహస్వప్నమైపోయాడు. ముందుగా తెలియపరచకుండానే సెక్షన్లపై మెరుపుదాడులు చేయటంతో, స్టాఫు పని చేసినా చేయకపోయినా సీటుల్లో మాత్రం వుంటున్నారు.

పార్వతీశం పని తేలికపడింది. తరచు ఆఫీసరు రూములోనే వుంటూ నిబంధనలు, క్రమశిక్షణా చర్యలపై సీరియస్‌గా ఆర్డర్లు జారీ చేయటంతో, ఆఫీసంతా వారంటే ఓ విధమైన భయం, ఏవగింపూ బయలుదేరాయి.

* * *

టైపిస్టులు, దిగువ తరగతి గుమాస్తాలకి పైస్థాయికి చేరుకొనేందుకు డిపార్ట్‌మెంటల్ పరీక్షలున్నాయి. అలాగే ఎగువ తరగతి గుమాస్తాలు సూపర్నెంటు ప్రమోషను పొందాలంటే కూడా పరీక్షలు పాసవ్వాలి. సూపర్నెంట్లు ఆఫీసర్లు అయేందుకు సీనియారిటీ లిస్టు వుంది. ఇదంతా తాబేలు నడకలాగ వుంటుంది.

ఆఫీసర్లకు తైరుకొట్టి, మస్కా భజనలు చేస్తూ వారి వీలువాలు కనిపెడుతూ ప్రమోషన్లు పొందేందుకు ఎప్పుడూ ఏ ఆఫీసులో అయినా తలుపులు తెరిచేవుంటాయి.

అదొక కళ. ఆ విద్య నేర్చుకొనేందుకు ఎంతో యిబ్బంది పడవలసివస్తుంది. ఖర్చుకు వెనుకాడ కూడదు. ఆ తారకమంత్రం అందరికీ సరిపడదు.

పార్వతీశం లాంటివారికి అసలు పనిచేయదు.

ఉద్యోగ సంఘాలవాళ్ళు, ఉద్యోగుల ప్రమోషను అవకాశాల గురించి ఓ వినతి పత్రం సమర్పించారు. దానిమీద నివేదిక తయారుచేయమని వేణుగోపాల్, పార్వతీశాన్ని ప్రత్యేకంగా కోరేడు.

తను చేసిన పది పేజీల నివేదికపై పరిశీలిం చేందుకు ఆఫీసరుకు నెల రోజులు పట్టింది.

అదనపు పోస్టులు మంజూరుకు హెడ్డాఫీసుకు ప్రత్యేకంగా ఉత్తరం రాయించాడు పార్వతీశం. వేణుగోపాల్ ఉద్యోగుల పట్ల ఉదాసీన వైఖరి కనపరుస్తూ, పదిహేను రోజులకోసారయినా హెడ్డాఫీసుకు గుర్తుచేస్తూ, ఫోనుల్లో తెలుసు కొనేవాడు.

ఆరు నెలలు గడిచాయి.

* * *

హెడ్డాఫీసు అధికారులకి వేణుగోపాల్ తీరుపై అనుమానం కలిగింది. ఉద్యోగులపట్ల అతను యింత 'యిది'గా ఎందుకుంటున్నాడో అర్థంకాలేదు, వాళ్ళకి.

హెడ్డాఫీసుకు వచ్చి మాట్లాడమని వేణుగోపాల్‌కు టెలెక్స్ మెసేజ్ యిచ్చారు.

వారం రోజుల తరువాత —

వేణుగోపాల్ తిరిగొచ్చాడు... అతని ప్రతిపాదన లను వేటిని ఆమోదించలేదు. ప్రస్తుత పరిస్థితినే కొనసాగించవలసిందిగా నచ్చజెప్పి పంపించారు. నిధుల కొరతగా వుండటంవలన, యీ వ్యవహారాన్ని ఆర్థిక మంత్రిత్వశాఖ పరిశీలనకు పంపుతున్నట్లు తెలిపారు. అంతవరకు యీ విషయమై, ఎటువంటి వుత్తరాలు వ్రాయవద్దన్నారు.

రెండు నెలల తరువాత వేణుగోపాల్‌కు బదిలీ అయింది. ఆయన స్థానంలో పనిచేసేందుకు సరియైన వ్యక్తి లేకపోవటంవలన, హెడ్డాఫీసువాళ్ళు ఎవరిని నియమించటం జరగలేదు.

కాబట్టి వేణుగోపాల్ పెర్సనల్ అసిస్టెంటునే అంతవరకూ అదనపు బాధ్యతలను చూడమని చెప్పారు, హెడ్డాఫీసువారు.

* * *

గోవిందరామయ్యకు ఆ రోజు సన్మానం. ఆఫీసులో క్లబ్, బ్యాంకు, సాహితీ, నాటక సమితులు, ఉద్యోగ సంఘం, ఇతర ప్రముఖులు కలిసి ఒక అభినందన సభ ఏర్పాటు చేసారు.

తనకు చేసిన సన్మానానికి ఉచితరీతిని అందరినీ గోవిందరామయ్య సమాధానమిచ్చేడు.

దిగువ తరగతి గుమాస్తాగా ఉద్యోగంలో చేరిన ఆయనకు, యీ హోదా లభించేందుకు ముప్పై ఆరేళ్ళు పట్టింది. అందుకు ఆయన ఎన్నో ఒడుదుడుకులను, కష్టసుఖాలని ఎదుర్కొన్నాడు.

గమ్యం చేరేందుకు అనేక దారులుంటాయి. ఒక్కొక్కరు ఒక్కొక్క దారిలో నడుస్తూ గమ్యం చేరుతారు.

సరిగ్గా అదే పద్ధతిలో వ్యవహరించటంవల్ల పార్వతీశం సూపర్నెంటుగానూ; గోవిందరామయ్య సీనియర్ అధికారిగానూ వున్నారు. అదే వారి అదృష్టం!

మూడు నెలల తరువాత, హెడ్డాఫీసునుంచి గోవిందరామయ్యకు ప్రమోషన్లు, అదనపు పోస్టుల భర్తీపై మాట్లాడేందుకు పిలుపు వచ్చింది.

కొత్త ఆఫీసరు గోవిందరామయ్యకు పని తెలియదు. కాని అన్నీ తెలిసినట్లు నటించుటలో మేధావి. ఎదుటివారిని బోల్తా కొట్టించగల నేర్పూ, లౌక్యం, రాజకీయం బాగా వుండటంతో అతని దారిలో వున్న ముళ్ళు, రాళ్ళు వాటంతటవే తొలగిపోతుంటాయి.

పార్వతీశం ఆయనకు కుడి భుజంగా మాత్రం కాక, అన్నీ తయారుచేసి, ఫైళ్ళని సంతకం నిమిత్తం పంపిస్తే, 'ఇనీషియల్' వేసి, త్రిప్పి పంపేయటం మాత్రమే గోవింద రామయ్య పని. సమావేశాల్లోను, హెడ్డాఫీసువారికి ఎలామాట్లాడాలో, ఏం చెప్పవలసిందీ అన్నీ కూలంకషంగా చెప్పేవాడు.

గోవిందరామయ్య మెదడులో వ్యవసాయం చేస్తే ఎరువులు, మందులు అవసరం లేకుండానే పుష్కలమైన పంటలు పండించి దేశ ఆహార సమస్యని నివారించవచ్చని ఆ ఆఫీసులో అందరికీ తెలిసిన విషయం.

* * *

వారం రోజులపాటు హెడ్డాఫీసులో వుండేసరికి, గోవిందరామయ్య వ్యవహారం సఫలం చేస్తున్నాడని ప్రమోషనుకోసం ఎదురుచూసేవాళ్ళు, మరికొందరు ఏవేవో కలలు, వూహాగానాలు చేయసాగారు.

అన్నీ నిజమే మరి! అయితే యీసారి అయిదు మెరిట్ ప్రమోషన్లు యిచ్చి, పదేళ్ళక్రితం నిలిచిపోయిన యీ అవకాశాన్ని మళ్లీ బయటకు తీసుకురావలసిన అవసరం హెడ్డాఫీసువారికి కలిగింది ఎందుకో?

నెల రోజులపాటు గోవిందరామయ్య, పార్వతీశం ఆ విషయమై తీవ్రంగా చర్చలు జరిపారు. సీనియారిటీ లిస్టు, కాన్ఫిడెన్షియల్ రిపోర్టులు తెప్పించి ౧౦ పదిమంది అభ్యర్థులని (అందులో పార్వతీశం ఒకడు) ఎంపిక చేసారు.

అయితే జాబితాలో పార్వతీశం పేరు గోవిందరామయ్య స్వహస్తాలతో రాసేడు.

మెరిట్ ప్రమోషను పొందే సూపర్నెంట్ల పేర్లు, ఎలాగో బయటికి పొక్కాయి. ఎవరికి వారు లెక్కలు, అదృష్టాలు వూహించుకొంటూ కావల్సిన సెక్షన్లగురించి ముందుగానే ఆలోచించుకోసాగేరు.

* * *

ప్రమోషన్లు యివ్వవలసిన అభ్యర్థులు, మెరిట్ లిస్టు తీసుకొని గోవిందరామయ్య మళ్లీ ఢిల్లీ వెళ్ళాడు.

నెల రోజుల్లో ఢిల్లీవర్గాలవారు ఆయన్ని ఎనిమిదిసార్లు ఫోనులోను, మూడుసార్లు తమదగ్గరకు పిలిపించుకొని మంతనాలు జరిపారు.

అయితే మెరిట్ ప్రమోషను యివ్వవలసిన అభ్యర్థుల విషయంలో ఢిల్లీ వర్గాలవారికి, గోవిందరామయ్యకు కొద్దిగా భేదాభిప్రాయాలు కలిగినట్లుగా, ఉద్యోగులు ప్రచారం చేయసాగారు. ఏదిఏమైనా స్వప్నమాత్రం ఎవరికివారే ఆశాలోకంలో విహరిస్తున్నారు.

* * *

ఆరోజే గోవిందరామయ్య జాబితా ఖరారు చేసుకొని తిరిగొచ్చాడు. ఢిల్లీవారిని ఒప్పించేందుకు ఆయనెంతో కష్టపడవలసివచ్చింది. మనసంతా చికాగ్గా వుంది. ఆఫీసుకెళ్లలేక యింటికెళ్ళి, విశ్రాంతి తీసుకోవాలనుకొన్నాడు.

మర్నాడు పదకొండు గంటలకు, సూపర్నెంటులుగా ప్రమోషన్లనిచ్చినవారి జాబితాను నోటీసు బోర్డులో వేశారు.

మొట్టమొదటిసారిగా, ఆఫీసు పరీక్షలు ప్యాసవకుండా తిన్నగా సూపర్నెంటు ప్రమోషను పొందిన రాజ్యలక్ష్మి అందరిని ఆశ్చర్యపరిచింది.

మెరిట్ జాబితాలో ఎవ్వరికీ, మెరిట్ ప్రమోషను యీయాలేదు. వేరే ముగ్గురికి ఆ ప్రమోషన్లు యివ్వటం జరిగింది. గ్యారంటీ అభ్యర్థులు అందరూ తిరస్కరింపబడ్డారు.

పార్వతీశం మెరిట్ లిస్టులో చేర్చబడినా, వేరే ముగ్గురిలోకూడా చేర్చబడలేదు. ఆయన్ని ఒక "సన్మానపత్రం"తో సత్కరించారు.

రెండు రోజులపాటు ఉద్యోగసంఘపు నాయకులు మెరిట్ ప్రమోషన్లు పొందినవారిని దుయ్యబట్టారు. గోవిందరామయ్యను విమర్శించారు. డౌన్...డౌన్... అంటూ అరిచేరు...నాలుగు రోజులు అరిచి వోళ్ళ నెప్పులుపట్టి విరమించుకొన్నారు...అంతే!

* * *

## బంగారు పర్వతం!

పశ్చిమ జర్మనీలోని మాక్స్‌ప్లాంక్ శాస్త్రవేత్తలు బంగారు పర్వతాన్ని కనుగొన్నారు. ఆ పర్వత ప్రాంతంలో ఒక బంగారు కణిక లభించడంతో శాస్త్రజ్ఞులు పరిశోధనలను చేపట్టి, ఆ పర్వతంలో పెద్ద బంగారు గని వున్నట్లు నిర్ధారించారు. సుమారు రెండున్నర వేల సంవత్సరాల క్రితం ప్రఖ్యాత గ్రీకు రచయిత హెరిడోటస్ యీ బంగారు పర్వతాన్ని గురించి ఒక పుస్తకంలో వ్రాశాడు. అది యిప్పటికి బయటపడింది. ఈ పర్వతం నుండి నమూనాలను పరిశీలించడంలో శాస్త్రజ్ఞులు చంద్రమండల నమూనాల పరీక్షా విధానాన్ని అనుసరించారు.

అయితే యీ ప్రమోషన్ల "తెర వెనుక" ఏం జరిగింది? ఒకప్పుడు గోవిందరామయ్యకు, రాజ్యలక్ష్మి 'హోటల్ కన్నె-చెర'లో "పగటి సుఖం" అందించింది. అప్పట్లో చేసుకొన్న ఆ పుణ్యమే, యీరోజు ప్రమోషను పొందే అవకాశం కలిగించిందామెకు.

ఆఫీసు పరీక్షలు ప్యాసయి, ప్రమోషనుకోసం ఎదురు చూస్తున్న అభ్యర్థులు నలభై అయిదువేలు వసూలు చేసారు.

'ఉద్యోగ నియామక పత్రాలు' అందిన అయిదుగురు అభ్యర్థులు, గోవిందరామయ్య స్టెనో సత్యమూర్తికి 'నలభై వేలు' అందించారు. ఇదంతా నడిపించిన మూర్తికి 'అదనపు ఇంక్రిమెంటు' యివ్వటం జరిగింది. రెండేళ్లనుంచి వారు ఎదురు చూస్తున్నారు.

అయితే మెరిట్ ప్రమోషన్లు పొందిన ముగ్గురు సూపర్నెంట్లకు ప్రతిభ, సామర్థ్యం ఏమీ లేకపోయినా, అధికారులు కరుణాపాత్రులయ్యేందుకు చాల శ్రమపడ్డారు ... అవన్నీ గోవిందరామయ్యకు తెలిసినా, ధనరూపంలో వారు ఢిల్లీవారిని సంతృప్తిపరిచి, కోరుకున్న సెక్షన్లు అక్కడే ఖరారు చేయించుకొన్నారు. హోదా, అధికారం, పలుకుబడి పొందేందుకు అనేక దారుల్లో ధనం, స్త్రీ విరివిగా అవసరపడతాయని అందరికీ తెలిసినా, ఆచరణలో అందరికీ సాధ్యం కాదు. అందుకు ధైర్యం. తెగింపు కావాలి.

గోవిందరామయ్యకు, సత్యమూర్తికి తోడుగా వుండి, తన సహాయ సహకారాలు అందించిన రాజ్యలక్ష్మి భర్త ఆఫీసులో కేవలం ఒక దిగువ తరగతి గుమస్తా మాత్రమే! ఇదంతా అతనే నడిపించినట్లు ఎవ్వరికీ తెలిసే అవకాశం లేదు. చీకటి మనుషుల చీకటి కోరికలు తీర్చడమే అతని ప్రత్యేకత!

పార్వతీశం భార్య సుభద్రమాత్రం "ఇన్నేళ్ళు మీరు చేసిన గొడ్డు చాకిరీ, మెరిట్ ప్రమోషను పొందేందుకు పనికిరాకపోయినా యికముందు 'టంగ్ క్లీనర్' కొనే అవసరం తొలగించింది" అంది.

పార్వతీశం భార్యవైపు అర్థం కానట్లు చూసాడు.

"ఆ పత్రం యీ విధంగా వుపయోగబడుతుంది" అని అన్నప్పుడు ఆయన బాధ పడలేదు. కాని ఆ 'పత్రం' మాజీ అధికారి వేణుగోపాల్ ద్వారానే అని మాత్రం వారిద్దరికీ తెలియదు. ఆ పత్రమే ఆయన్ని ఎంతో సంతృప్తి పరిచింది.

వారం రోజుల తరువాత, ప్రమోషన్లు పొందిన వాళ్లందరూ గోవిందరామయ్యకు, సత్యమూర్తికి 'హోటల్ అశోకా'లో పార్టీ యిచ్చారు.

తనకు లభించిన 'అసాధారణ ప్రమోషను'కు కృతజ్ఞతగా రాజ్యలక్ష్మి మాత్రం గోవిందరామయ్యకు "హోటల్ కన్నె చెర"లో యీసారి 'రాత్రిసుఖం' యిచ్చేందుకు ఆహ్వానించింది.

మొదట తనపేరు మెరిట్ జాబితాలో చేర్చబడి, చివరికి రెండో జాబితాలో ఎందుకు చేర్చబడలేదో పార్వతీశానికి యింతవరకూ అర్థం కాలేదు. అర్థమయినా, చేసేదేమీ లేదు...అది అంతే! ★